# బాసిజమ్

## మినీ కథ



సూర్యం దిగాలుగా మేనేజరు గదిలోకి వెళ్ళాడు. ఏవో ఫైల్స్ తిరగేస్తున్న మేనేజరు వెంకటశివం గారి ముందు తప్పు చేసిన మనిషిలా నిల్చొన్నాడు.

తనముందు నిల్చొన్న సూర్యాన్ని తను గమనించినా గమనించని మనిషిలా తన పనేదో తను చూచుకొంటున్నారు వెంకటశివంగారు.

తన మేనేజర్ది నటనని తెలియని సూర్యం చిన్నగా సకిలించాడు మేనేజరువైపు దృష్టి సారించి.

సూర్యం సకిలింపుకు ఇక తను విషయం కనుక్కోక తప్పదు అన్నట్టుగ మేనేజరు వెంకటశివంగారు సూర్యం వైపు తిరిగి 'ఎందుకొచ్చావ్?' అన్నట్టుగ చూశారు.

"నాకు రెండ్రోజులు లీవు కావాలిసార్!" పొర్లుకొస్తూన్న దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుకొంటూ అన్నాడు సూర్యం.

"లీవ్ అనేదే శాంక్షను చేస్తే ఆఫీసులో ఉన్న స్టాఫ్ అందరూ నీలా లీవ్ కావాలంటూ మీదపడతారోయ్. అదేం కుదర్దు. నేనసలు లీవ్ నీకు శాంక్షను చేయనుగాక చేయను" తన బాసిజాన్ని సూర్యం ముందు ప్రదర్శించారు మేనేజర్ వెంకటశివంగారు.

"సార్! నా భార్యకు ఇది మొదటి డెలివరి. నేను దగ్గర లేకపోతే వీలుకాదు. ఎలా అయినా ఈ రెండ్రోజులు సెలవిప్పించండి. నచ్చి మీ కడుపున పుడ్తాను" చివరి మాటనక వీల్లేక పోయింది సూర్యానికి.

సూర్యం మాటలకు మేనేజరు వెంకటశివంగారికి అరికాళ్ళమంట నెత్తికెక్కింది.

"నీవు నా కడుపున పుట్టక్కర్లేదయ్యా! నా భార్యక్కూడా డెలివరీ టైమే! అలా అని నేను సెలవు పెట్టుకొని అక్కడ కూర్చొంటే ఈ ఫైల్సన్నీ ఎవరు చూస్తారు? ఎవరు చేస్తారు?"సూర్యంపై చిందులు త్రొక్కడం ప్రారంభించారు వెంకటశివంగారు.

"సార్! ఎలా అయినా సెలవిప్పించాలి" దాదాపు ఏడ్చినట్టుగానే అంటున్న సూర్యం వైపు చూస్తూ "ఇవిగో ఈ రెండు అర్జెంటు ఫైల్సు. ఇవి కంప్లీట్ చేశాక నీకు తప్పక లీవ్ శాంక్షను చేస్తాను" బీరువాలో ఉండే రెండు అర్జెంటు ఫైల్స్‌ని తీసి సూర్యం చేతికి అందిచ్చారు వెంకటశివంగారు.

తన బాస్ అందించిన రెండు ఫైల్స్‌ని పట్టుకొంటూ "సార్! ఫైల్స్ పూర్తి చేశాక తప్పక నాకు లీవ్ శాంక్షను చేస్తారు కదూ!" ఆశగా వెంకటశివంగారి వైపు చూశాడు సూర్యం.

"తప్పక లీవ్ శాంక్షను చేస్తాను గానీ, ముందా ఫైల్స్ కంప్లీట్ చేయ్" పల్లికిలించి నవ్వుతూ సూర్యం వైపు చూశారు వెంకటశివం.

మేనేజర్ ఇచ్చిన రెండు ఫైల్స్‌నీ అందుకొన్నాడో లేదో ఆఫీసు ప్యూన్ సుబ్బారావు రూండోర్స్‌ను తోసుకొంటూ మేనేజర్ వెంకటశివానికి శాల్యూట్ చేశాడు.

"ఏం సుబ్బారావ్ ఏంటి విశేషం?" ఆతృతగా ప్రశ్నించాడు ఆఫీసర్ వెంకటశివం.

"ఒక విశేషం కాదండిసార్ రెండు విశేషాలున్నాయి." తన జేబులో చేయిపెట్టి కవరొకటి తీసాడు ప్యూన్ సుబ్బారావు.

"ఏమిటో ఆ విశేషాలు?"

"ఒకటి ఇందాక మీరు మీ ఇంటికి పని మీద పంపేటప్పటికి మీ ఆవిడగారికి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. రెండోది మన ఆఫీస్ చీఫ్ సూపరిండెంట్ శోభ్రనాది గారు మీకు వెరీవెరీ అర్జెంటంటూ కవరొకటి పంపారు." అంతవరకు చేతిలోవుంచిన కవరును మేనేజరు వెంకటశివంగారి చేతిలో పెట్టాడు.

సుబ్బారావు చేతినుంచి అందుకొని ఆ కవరును విప్పి లోన మేటరు పూర్తిగా చదవకముందే 'సుబ్బారావ్' అంటూ బాధగా పిల్చాడు.

"ఏంటి సార్!" అంటూ ప్యూన్ సుబ్బారావు వెంకటశివంగారి దగ్గరకు వచ్చాడు.

"పెట్టె బెడ్డింగులు సిద్ధం చేయ్. అవతల మన చీఫ్ సూపరిండెంట్ శోభనాద్రి గారి కూతురు పురిటినొప్పులతో బాధపడుతోందట. అవిడ్ని హాస్పిటల్‌లో చేర్చి బాగోగులు చూడమని అర్జెంటుగా లెటర్ రాసారు" చుక్క త్రిప్పుకోకుండా అంటూ టీపాయ్ మీదున్న గ్లాసుడు మంచి నీళ్ళను గటగటమని త్రాగేశారు వెంకటశివంగారు.

అప్పుడర్థమయ్యింది అంతవరకు అక్కడ నిల్చొని వింటున్న సూర్యానికి 'బాసిజమ్' అంటే ఏమిటో!

—మౌళి కేశవరావు